## క్లుప్తంగా

### ఈస్టాంపు కౌంటర్ ప్రారంభం



నిర్వాహకుడికి అనుమతి పత్రాన్ని అందిస్తున్న సబ్‌రిజిస్ట్రార్

**కార్వేటినగరం:** స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ స్టాంపు కౌంటర్‌ను సబ్‌రిజిస్ట్రార్ అశోక్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పాత స్టాంపు పేపర్ల స్థానంలో ఈ స్టాంపును తీసుకొచ్చిందని తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో పని చేసే (ఈస్టాంపు కౌంటర్) ద్వారా నాన్ జ్యుడిషియల్ ఈ–స్టాంపులు పొందవచ్చన్నారు. ఆస్తులు కొనుగోలు, విక్రయాలు వంటి లావాదేవీలను పూర్తి చేయడానికి చెల్లింపులు ఆన్‌లైన్ ద్వారా చేసుకోవచ్చని పేర్కొన్నారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

**పాలసముద్రం:** శ్రీకావేరిరాజుపురం ఆరోగ్య ఉపకేంద్రంలో శుక్రవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన 30 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ మాట్లాడుతూ.. 104 వైద్య క్యాంప్‌లో ఉచిత కంటి వైద్య పరీక్షలు చేస్తామని తెలిపారు. 60 ఏళ్లు పైబడిన వారికి కంటి వైద్య పరీక్షలతో పాటు ఆపరేషన్లు, కంటి అద్దాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆప్తమాలజీ అసిస్టెంట్ రమిళ, ఎంఎల్‌హెచ్‌పీ సునిత, ఏఎన్‌ఎం రేవతి పాల్గొన్నారు.

### పీడీకి సన్మానం



సదాశివంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**విజయపురం:** మండలంలోని గంగమాంబపురం ఉన్నత పాఠశాల పీడీ సదాశివంను ఉపాధ్యాయులు శుక్రవారం సన్మానించారు. ఇటీవల ఆయన బదిలీపై నారాయణవనం ఉన్నత పాఠశాలకు వెళ్లారు. ఈ సందర్భంగా గంగమాంబపురం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఆయన్ను పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థులకు క్రీడల్లో మెలకువలు నేర్పించి, మండల, జిల్లా స్థాయిలో మంచి గుర్తింపు తీసుకొచ్చారని అన్నారు.

### ముమ్మరంగా కుష్టు సర్వే

**విజయపురం:** మండలంలో కుష్టు సర్వే పక్కాగా నిర్వహించాలని డాక్టర్ సోమశేఖర్ తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుంచి అన్ని పంచాయతీల్లో వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు కుష్టు సర్వే చేస్తున్నారని చెప్పారు. కుష్టు వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రిలో పరీక్ష చేయించుకోవాలన్నారు. ఇది అంటువ్యాధి కాదని, ప్రారంభంలో గుర్తిస్తే మంచిదన్నారు.

### సచివాలయ కార్యదర్శికి డాక్టరేట్



చాంద్‌బాషా

**పుత్తూరు రూరల్:** పుత్తూరు మున్సిపాలిటీ 3వ వార్డు సత్య నారాయణ కాలనీ సచివాలయ అడ్మిన్ కార్యదర్శి చాంద్‌బాషాకు వేలూరుకు చెందిన విట్ యూనివర్సిటీ శుక్రవారం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆచార్య గిరిరాజ్ పర్యవేక్షణలో మైక్రో నీడిల్స్ వ్యాక్సిన్ డెలివరీ అప్లికేషన్స్ అంశంపై చేసిన పరిశోధనకు వర్సిటీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం పీహెచ్‌డీని ప్రకటించింది.

### భక్తిప్రపత్తులతో గోవిందుడి జ్యేష్ఠాభిషేకం

**తిరుపతి కల్చరల్:** గోవిందరాజస్వామి ఆలయంలో శుక్రవారం జ్యేష్ఠాభిషేకం వేడుకగా ప్రారంభమైంది. తొలుత ఉదయం సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి కైంకర్యాలు చేశారు. శత కలశ స్నపనం, మహా శాంతి హోమం చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవమూర్తులను కల్యాణ మండపానికి వేంచేపు చేసి స్నపన తిరుమంజనం నిర్వహించారు. పంచామృతంతో అభిషేకించారు. ఆ తర్వాతస్వామి వారి కవచాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కవచాధివాసం చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి వారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో పెద్దజీయంగార్ స్వామి, చిన్న చిన్నజీయంగార్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, ప్రధానార్చకుడు శ్రీనివాస దీక్షితులు, ఏఈఓ రవికుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్లు నారాయణ, మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రాధాకృష్ణ, ధనుంజయులు పాల్గొన్నారు.

# పచ్చిరొట్టతో భూమికి సారం

- 112 మంది రైతులకు 50 క్వింటాళ్లు
- ఆర్బీకే ద్వారా సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ
- విజయపురం మండలంలో సాగు పనులు ప్రారంభం



గంగమాంబపురంలో పచ్చిరొట్ట సాగు

**విజయపురం (నగరి):** ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో పంట సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా ముందుగా భూసారాన్ని పెంచుకోవడంపై దృష్టి సారిస్తున్నారు. భూమికి బలాన్ని చేకూర్చే పచ్చిరొట్ట ఎరువైన జీలుగు పంటను సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ సీజన్‌లో పచ్చిరొట్ట సాగుకు అనువైన సమయంగా రైతులు భావిస్తారు. సన్న రకం వరి పండించే వారు ఇప్పటి నుంచే జీలుగు విత్తుకునే పనిలో నిమగ్నమవుతున్నారు. మండలంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసింది. మండలంలో 112 మంది రైతుకు రైతు భరోసా కేంద్రాల్లో 56 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువులను అందించారు.

**భూమి సారవంతం**

పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతంగా మారుతుంది. సేంద్రియ, రసాయన ఎరువులు వేసే అవసరం తగ్గుతుంది. భూసారం తగ్గి, పంట దిగుబడిపై ప్రభావం పడుతుండడంతో అప్రమత్తమైన అధికారులు మూడేళ్లుగా జీలుగ సాగుపై ప్రత్యేక దృష్టిట్ పెట్టారు. రైతులకు అవగాహన కల్పించడంతో విజయపురం మండలంలో జీలుగ, పిల్లి పెసర, కట్టె జనుము సాగు చేయడానికి అన్నదాతలు ముందుకు వస్తున్నారు. వరి సాగు చేసే రైతులు తక్కువగా వీటిపై ఆసక్తి చూపుతున్నారు. దమ్ము పట్టి వరినారు వేసే రైతులు పచ్చిరొట్టను సాగు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు.

ఇప్పటికే మండలంలో పచ్చిరొట్ట విత్తనాలను రైతుకు అందించారు.

**ఆర్బీకే ద్వారా..**

ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల ద్వారా జనుము, జిలగ సరఫరా చేశారు. పది కిలోల జీలుగు విత్తనాలు రూ. 395, పది కేజీల జనుము రూ. 420గా నిర్ణయించి సబ్సిడీపై రైతులకు అందించారు. వరి సాగు చేసే నెల రోజుల ముందే పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకోవాలి. ఎకరాకు పది కిలోల పచ్చిరొట్ట విత్తనాలు అవసరం. వరినారు పోసే పది రోజుల ముందు నుంచే భూమిని కలియదున్నితే పైరు భూమిలో మునిగి భూసారం పెరుగుతుంది. నేలకు సహజ మిత్రులైన వానపాముల ఉత్పత్తిని పెంచుతుంది. తుంగ, గరిక వంటి కలుపు మొక్కలను నివారించగలవు.

**కుళ్లిన తరువాత నాట్లు వేయాలి**

పచ్చిరొట్ట ఎరువు తేలికపాటి నేలల్లోనూ, ఇసుక, చౌడు భూముల్లోనూ సాగు చేసుకోవచ్చు. చౌడు భూముల్లో ఉన్న లవణాలను తీసివేసి, మంచి భూమిగా తయారు చేయడంలో పచ్చిరొట్ట ఎరువు ఎంతగానో దోహదపడుతుంది. దీనినుంచి ఎకరాకు ఐదు టన్నుల పచ్చిరొట్ట ఎరువు ఉత్పత్తి అవుతుంది. 35 నుంచి 45 రోజుల మధ్యలో భూమిలో కలియదున్నాలి. ఇందులో 8 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్, 35 కిలోల నత్రజని ఉంటుంది. పిల్లి పెసర పచ్చిరొట్టగా, పశుగ్రాసంగా ఉపయోగపడుతుంది. పచ్చి రొట్టను పొలంలో కలియదున్నితే కుళ్లిన తరువాత నాట్లు వేసుకోవాలి.

**సాగుకు రైతుల ఆసక్తి**



గతంతో పోలిస్తే పచ్చిరొట్ట ఎరువు సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం విత్తనాలను 50 శాతం సబ్సిడీపై రైతులకు అందించడం వల్ల మరింతగా ఉపయోగపడుతుంది. ఇప్పటికే పలువురు రైతులు సాగు చేశారు. నీటి వసతి లేని వారు వర్షాలు పడిన తరువాత వేసుకుంటే మంచిది. పచ్చిరొట్ట ఎరువు సాగు, ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– రజినికుమారి, విజయపురం, వ్యవసాయాధికారిణి

# ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ హరి

**పుత్తూరు రూరల్:** జగనన్న సురక్ష పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని మున్సిపల్ చైర్మన్ ఏ.హరి అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సమావేశ మందిరంలో ఎఫ్‌టీఏ ఎంఎల్‌ఓ దిలిప్‌మొదలి, జేసీఎస్ కన్వీనర్ ఏకాంబరం ఆధ్వర్యంలో కళ్యాణపురం, ఆర్టెమ్మ కాలనీ సచివాలయ పరిధిలోని వలంటీర్లు, గృహసారథులకు జగనన్న సురక్షపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హరి మాట్లాడుతూ.. అర్హత ఉండి వివిధ సేవలు, పథకాల లబ్ధి పొందడంలో విఫలమైన వారిని గుర్తించి వారికి లబ్ధిచేకూర్చడమే జగనన్న సురక్ష పథక లక్ష్యమని తెలిపారు. అయితే ఇంటింటికి వెళ్లే వలంటీర్లు, గృహసారథులు ప్రజలకు పథకాల గురించి అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేఎల్‌ఎన్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు జయలక్ష్మి, చిట్టిబాబు, నాయకులు మనోహర్‌రెడ్డి, ఈశ్వరయ్యయాదవ్, శివ పాల్గొన్నారు.



శిక్షణ తరగతులకు హాజరైన వలంటీర్లు, గృహసారథులు

**వడమాలపేటలో:** పత్తిపుత్తూరు సచివాలయ పరిధిలోని వలంటీర్లు, గృహసారథులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర శాప్ డైరెక్టర్ యాదవ్‌రెడ్డి, సర్పంచ్‌లు తులసి, కుసుమ, నాయకులు కిరణ్, చంద్రారెడ్డి, రామిరెడ్డి, సుధీర్‌రెడ్డి, రవిరెడ్డి, కమల, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పరిష్కారం చూపుతాం



తిమ్మాపురంలో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కమిషనర్, సీఐ

**పుత్తూరు రూరల్:** పుత్తూరు మున్సిపాలిటీ 2వ వార్డు తిమ్మాపురం గ్రామంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యకు ప్రత్యామ్నాయ పరిష్కారం చూపుతామని కమిషనర్ కేఎల్‌ఎన్‌రెడ్డి స్పష్టం చేశారు. తిమ్మాపురంలో కొద్ది రోజులుగా డ్రైనేజీ సమస్యపై గ్రామస్తులు రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో శుక్రవారం సీఐ లక్ష్మీనారాయణతో కలిసి కమిషనర్ గ్రామంలో పర్యటించారు. సమస్య పరిష్కారానికి తగిన మార్గ అన్వేషణ చేశారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఇరుపక్షాల వారు సమన్వయం పాటించాలని.. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ లక్ష్మీనారాయణ హెచ్చరించారు.

# గోపాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం



గోపాల్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

**పుత్తూరు రూరల్:** పుత్తూరులో కార్మిక సంఘ వ్యవస్థాపకుడు కె.గోపాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక నగరం రోడ్డులో నిర్వహించిన గోపాల్‌రెడ్డి రెండో వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి కుమారులు భరత్, మున్సిపల్ వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్, ఎంఎల్‌ఓ దిలిప్‌మొదలి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులురెడ్డి, రమేష్ బాబు, సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

**కార్మికుల కోసం ఎన్నో పోరాటాలు**

కార్మిక నాయకుడు గోపాల్‌రెడ్డి తన తుది శ్వాస వరకు కార్మికుల సంక్షేమం కోసమే పాటుపడ్డారని సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక చిదా స్పిన్నింగ్ మిల్లు వద్ద ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని పయనీర్ స్పిన్నింగ్ మిల్లులో కార్మిక సంఘాన్ని 40 ఏళ్ల క్రితమే ఏర్పాటు చేసి వారి హక్కుల కోసం పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు ఏలుమలైరెడ్డి, రామూర్తి, రాజేంద్ర, నాగూర్, మానస, కాటయ్య, చక్రవర్తి, బాబు పాల్గొన్నారు.

# గృహనిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

- జగనన్న సురక్షపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి
- కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలకు పరిష్కారం చూపుతాం
- మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

**నగరి:** జగనన్న కాలనీల్లో చేపడుతున్న ఇళ్లనిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. శుక్రవారం నగరి మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి సమావేశపు అజెండాను సభ్యులకు చదివి వినిపించారు. అజెండాలో ఏవైనా అభ్యంతరాలుంటే తెలపాలన్నారు. దీనిపై విప్ దయానిధి మాట్లాడుతూ.. అజెండా అంశంలో ఎలాంటి అభ్యంతరాలు లేవని.. జగనన్న కాలనీ సమీపంలో ఉన్న టైర్ బర్నింగ్ ఫ్యాక్టరీని అక్కడి నుంచి తొలగించాలన్నారు. దాని కారణంగా కాలుష్యం ఎక్కువగా ఉందన్నారు. దీనిపై టీపీఓ నీరజాక్షి సమాధానమిస్తూ వారికి అనుమతులు ఉన్నాయన్నారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ.. నివాసాలు లేని సమయంలో ఏవైనా అనుమతులు ఉండవచ్చని.. ప్రస్తుతం నివాసాలు ఏర్పడ్డాక అక్కడ ఉండకూడదని వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. కౌన్సిలర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకునేవారికి అండగా నిలబడి నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలన్నారు. జగనన్న సురక్షలో భాగంగా వార్డులో ఉండే నివాసితులకు పథకాలు అందడంలో సమస్యలున్నా, సర్టిఫికెట్లు అందడంలో సమస్యలున్నా గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో వైస్ చైర్మన్లు వెంకటరత్నం, బాలన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, డీఈ నరేష్, మేనేజర్ శేఖర్, మెప్మా అధికారి సునీత, హౌసింగ్ ఏఈ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి జగనన్న సురక్ష క్యాంప్‌లు

**నగరి:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకానికి సంబంధిత సచివాలయ క్యాంప్‌లు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మండల పరిధిలో నిర్వహించనున్న జగనన్న సురక్ష క్యాంప్‌ల షెడ్యూలును ఎంపీడీఓ లీలామాధవి శుక్రవారం విడుదల చేశారు.

| నిర్వహించే తేదీ | సచివాలయం |
|---|---|
| జూలై 1 – | ఎం.కొత్తూరు |
| జూలై 18 – | వీఎస్‌ఆర్ పేట |
| జూలై 4 – | బుగ్గ అగ్రహారం |
| జూలై 19 – | ముడిపల్లి |
| జూలై 5 – | దామరపాకం |
| జూలై 20 – | తిరుపతి |
| జూలై 6 – | నంబాకం |
| జూలై 22 – | మిట్టపాళెం |
| జూలై 11 – | బీరకుప్పం |
| జూలై 25 – | అడవికొత్తూరు |
| జూలై 13 – | ఓజీ కుప్పం |
| జూలై 27 – | గుండ్రాజుకుప్పం |
| జూలై 15 – | వీకేఆర్‌పురం |

**మున్సిపల్ పరిధిలో..**

మున్సిపాలిటీకి చెందిన 1,2వ వార్డులకు శనివారం కాకవేడు సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో పాటు, తహసీల్దార్, వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొంటారన్నారు.

# సీఎం పర్యటనను విజయవంతం చేద్దాం

**శ్రీరంగరాజపురం:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 4వ తేదీ జిల్లాకు రానున్న నేపథ్యంలో ఆయన పర్యటనను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్ రెడ్డి అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఇచ్చిన మాట ప్రకారం విజయా డెయిరీని ప్రారంభించేందుకు సీఎం వస్తున్నారని తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# భక్తుల సహకారంతో ఆలయ అభివృద్ధి



భక్తులతో టీటీడీ స్థానిక ఆలయాల ఏఈఓ

- అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థసారథి

**నగరి:** టీటీడీ ఆధీనంలో ఉన్న నగరి శ్రీకరియమాణిక్య స్వామి ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకురావాలని స్థానిక ఆలయాల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థసారథి అన్నారు. శుక్రవారం ఆలయానికి వచ్చిన ఆయన ఆలయంలో జరిగే నిత్య కైంకర్యాలు, పోటు, ఇతర అభివృద్ధి పనులు తనిఖీ చేశారు. స్థానిక భక్తులు ఆయన్ను కలిసి చాలా కాలంగా ఎదురు చూస్తున్న ఊంజల్ సేవను త్వరగా ప్రారంభించాలని, బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని కోరారు. దీనిపై ఏఈఓ మాట్లాడుతూ.. ఉన్నతాధికారులతో మాట్లాడి ఆగస్టు మొదటి వారంలో ఊంజల్ సేవ నిర్వహిస్తామని, దాతల సహకారంతో బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఉన్నతాధికారులతో చర్చిస్తామన్నారు. ప్రస్తుతం ప్రతి శనివారం మధ్యాహ్నం స్థానిక దాతల సహకారంతో జరిగే అన్నదాన కార్యక్రమాన్ని నిర్విరామంగా కొనసాగించాలన్నారు. స్థానిక ఆలయాల సూపరింటెండెంట్ రమేష్, ఆలయ అధికారి వెంకటరమణ, ప్రధానార్చకులు ధన్వంతరి ఆచార్యులు, రాంప్రసాద్ ఆచార్యులు ఉన్నారు.

# అన్ని వర్గాలు హర్షించేలా జగనన్న పాలన

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



వృద్ధురాలికి పాదాభివందనం చేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి



నూతన సచివాలయాన్ని ప్రారంభిస్తున్న నారాయణస్వామి

**గంగాధరనెల్లూరు(కార్వేటినగరం):** అన్ని వర్గాలు హర్షించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శుక్రవారం అగరమంగళం గ్రామ పంచాయతీలోని అగరమంగళం దళితవాడ, అగరమంగళం, బండికింద ఊరు, బలిజపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. నారాయణస్వామి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు వస్తున్నాయా అని ఆరా తీశారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో అందరూ సంతోషంగా ఉన్నాయని తెలిపారు. గ్రామాల్లో ఏ ఇంటికి వెళ్లినా అపూర్వ స్వాగతం పలుకుతున్నారని చెప్పారు. ఒకటో తేదీకే పింఛన్ వస్తుండడంతో అవ్వతాతలు చిరునవ్వులు చిందిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో పింఛన్ల కోసం పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాసే పరిస్థితి ఉండేదని.. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒకటో తేదీ తెల్లవారుజామునే తలుపు తట్టి అందిస్తున్నారని చెప్పారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజాప్రతినిధులకు సమాజంలో గౌరవం పెరిగిందన్నారు. 14 ఏళ్లు అధికారంలో ఉన్నా చంద్రబాబు ప్రజలకు చేసింది లేమీ లేదన్నారు. ఆయన చేసిన మోసాలను ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. ఆయన్ను ప్రజలు తిరస్కరించాలని పేర్కొన్నారు. కాగా గ్రామానికి చెందిన రాజమ్మ(80) మాట్లాడుతూ.. పేదలకు మంచి చేస్తున్న జగన్ ఎప్పుడూ ముఖ్యమంత్రిగానే కొనసాగాలని ఆశీర్వదించారు.

**ప్రభుత్వ భవనాలు ప్రారంభం**

అగరమంగళంలో నిర్మించిన రైతు భరోసా, గ్రామ సచివాలయం నూతన భవనాలను మంత్రి ప్రారంభించారు. గ్రామానికి రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు మంత్రికి విన్నవించడంతో స్పందించిన మంత్రి వెంటనే రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే కొత్తగా పెళ్లి చేసుకున్న జంటలను గుర్తించి వారికి పక్కాగృహాలు మంజూరు చేయాలన్నారు. స్థలాలు ఉన్నావారికి ఇళ్లు మంజూరు చేసి గృహనిర్మాణాలు చేపట్టేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీప్రియ, ఎంపీటీసీ సభ్యురాలు ఇందిరా, సర్పంచ్ సరోజమ్మ, పార్టీ మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, నాయకులు గుణశేఖర్‌రెడ్డి, కేశవరెడ్డి, గోవిందశెట్టి, దామోధరం, మురుగయ్య, చంద్రారెడ్డి, ఎంపీడీఓ ఉమాదేవి, తహసీల్దార్ ఇన్బనాథన్, ఏపీఎం చిరంజీవి పాల్గొన్నారు.

# నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



హౌసింగ్ కాలనీని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి వీరపాండ్యన్

**కార్వేటినగరం:** అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని చిత్తూరు జిల్లా ప్రత్యేక అధికారి (ఐఏఎస్) జి.వీరపాండ్యన్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. జగనన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేసేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జూలై 30వ తేదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టే సామూహిక గృహప్రవేశాలకు ప్రతి ఇల్లు సిద్ధం కావాలన్నారు. అనంతరం పద్మసరస్సు సమీపంలోని జగనన్న కాలనీని సందర్శించారు. మౌలిక వసతులపై లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం అన్నూరు సచివాలయం పరిధిలో జరుగుతున్న రీసర్వేను పరిశీలించారు. ఆ తర్వాత సచివాలయంలో రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్వేటినగరంలోని రేషన్‌షాపు, కొల్లాగుంట అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి లబ్ధిదారులకు సక్రమంగా సరుకులు అందించాలని ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలని ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన్ను సన్మానించారు. ఆయన వెంట హౌసింగ్ పీడీ టి.పద్మనాభం, డీఎల్‌డీఓ రవికుమార్, ఆర్డీఓ సుజన, హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ మోహన్‌మురళి, తహసీల్దార్ రవికుమార్‌రాజు, హౌసింగ్ ఏఈ యోగేంద్రనాయుడు, ఈఓపీఆర్డీ లక్ష్మీపతి, స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ ఉన్నారు.


# రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

**పుత్తూరు రూరల్:** రక్తదానం ప్రాణదానంతో సమానమని స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ విభాగాల విద్యార్థులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. వివిధ గ్రూపులకు సంబంధించిన రక్తం ఎప్పుడు ఎవరికి అవసరం అవుతుందో చెప్పలేమన్నారు. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా రక్తాన్ని స్టోర్ చేసిపెట్టుకోవడం ద్వారా ప్రాణాపాయంలోని వ్యక్తులను కాపాడేందుకు వీలు ఉంటుందన్నారు. యువకులు రక్తదానం చేయడం దేశానికి సేవ చేసినట్లేనని అన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు రాజశేఖర్‌రెడ్డి, సరమేశ్వర్లు, ఎన్‌సీసీ ఆఫీసర్ శ్రీనివాసులు, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్లు శ్రీనివాసులు, రఘురామ్, అధ్యాపకులు నరసింహులు, కోటేశ్వరయ్య, ప్రసన్నకుమార్, రాము, సాయివెంకటేష్ పాల్గొన్నారు.

### కూలీలకు గిట్టుబాటు అయ్యేలా పనులు



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

**పాలసముద్రం:** ఉపాధి హామీ కూలీలకు గిట్టుబాటు అయ్యేలా పనులు కల్పించాలని ఎంపీడీఓ ప్రేమ్ రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం క్రిష్ణజమ్మపురం, సింహరాజుపురం పంచాయతీల్లో జరుగుతున్న పనులను క్షేత్ర స్థాయిల్లో పరిశీలించారు. కూలీలు వలసలు వెళ్లి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో స్థానికంగానే పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఏడాదికి 100 రోజులు పనులు కల్పిస్తున్నామన్నారు. సకాలంలో బిల్లులు వచ్చేలా చూస్తామని చెప్పారు. ఇన్‌చార్జ్ ఏపీఓ అనుషా ఉన్నారు.